క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈఈ చిన్నయ్య

బద్వేలు అర్బన్ : ఏపీఎస్‌పీడీసీఎల్ పట్టణ ఏఈఈగా ఎం.చిన్నయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో.. బద్వేలు రూరల్ ఏఈఈగా పని చేస్తున్న ఈయనను పట్టణ ఏఈఈగా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందజేస్తామని తెలిపారు. అనంతరం ఏఈని లైన్‌మెన్లు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

ఖాజీపేట సబ్‌ఇంజినీర్‌గా నాగరాజు

ఖాజీపేట : ఖాజీపేట మండల సబ్‌ఇంజినీర్‌గా నాగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో బాగంగా ఖాజీపేట సబ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న గోవర్ధన్‌రెడ్డి బదిలీ పై వెళ్లారు. ఆయన స్థానంలో నాగరాజు వచ్చి, బాధ్యతలు స్వీకరించారు.

ఎర్రగుంట్ల ఎంపీడీఓ బదిలీ

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల మండల ఎంపీడీఓ ఎస్.భాగ్యలక్ష్మి నంద్యాల జిల్లాలోని రుద్రవరం మండలానికి బదిలీ అయ్యారు. 2023 జూన్ నెలలో ఎర్రగుంట్ల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఆమె సోమవారం రిలీవ్ అయ్యారు.

మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది బదిలీ

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న పలువురు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రిలీవ్ అయ్యారు. సీనియర్ అసిస్టెంటు రామకృష్ణ బ్రహ్మంగారిమఠం మండలానికి, జూనియర్ అసిస్టెంట్ మధు రాజుపాళెం మండల అర్కటవేముల జెడ్పీ హైస్కూల్‌కు, టైపిస్టు ఆయాసున్నీత రాజుపాళెం ఎంపీడీఓ కార్యాలయానికి, అటెండర్‌లు జాఫర్ మైదుకూరు ఎంపీడీఓ కార్యాలయం, శ్రీను ప్రొద్దుటూరు ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో సీనియర్ అసిస్టెంటుగా ఎర్రగుంట్ల నుంచి విష్ణు, టైపిస్టు రాజన్న ప్రొద్దుటూరు నుంచి, అటెండర్ రాజేష్ మైదుకూరు నుంచి చాపాడు ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు వారు బాధ్యతల్లో చేరారు.

బి.కోడూరు స్పెషలాఫీసర్‌గా జిల్లా వ్యవసాయాధికారి



నాగేశ్వర్‌రావు

బి.కోడూరు : మండల ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మండలాభివృద్ధికి తోడ్పాటు అందించడంతోపాటు ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి విధివిధానాల గురించి వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదివారం అందుబాటులో గ్రంథాలయం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయం ఇకపై ఆదివారం కూడా పాఠకులకు అందుబాటులో ఉంటుందని ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు తెలిపారు. సాధారణ పనిదినాలతోపాటు ఆదివారం కూడా గ్రంథాలయం పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రంథాలయంలో 12 వేల పైచిలుకు పుస్తకాలు ఉన్నాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి, జనరల్ నాలెడ్జి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు గ్రంథాలయం పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు.

27న జాబ్‌మేళా

వేముల: వేముల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 27వ తేదీన శుక్రవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుగుణావతి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బీజెడ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, ఆల్ డిక్సన్ కంపెనీ వారు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని.. టెన్త్, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలన్నారు.

ఆశీర్వాదం



బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఎస్ఎంఎస్ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ ఖాదర్‌వల్లి కుమార్తె వివాహ వేడుకలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గోపాలస్వామి, ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, పుత్తాశ్రీరాములు, ప్రభాకర్‌రెడ్డి, అల్లాబకాష్, మున్సిపాలిటీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, మౌలాలి, రఘురామిరెడ్డి, ఉమర్, నాగేశ్వర్‌రావు, రెడ్డెయ్య, కుప్పాలరమణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత.. అందరి బాధ్యత



గోపవరం : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది



ప్రొద్దుటూరు : ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్

గోపవరం : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగాంగా సోమవారం టీ.సండ్రపల్లెలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్విహించారు. నిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న పారిశుద్ధ్య కార్మికులను అభినందించాలన్నారు. ఎక్కడా కూడా మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దోమల బారిన పడకుండా దోమతెరలు ఉపయోగించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయరామిరెడ్డి, ఎంపీటీసీ భాగ్యమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పీఆర్ ఏఈ చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రతిజ్ఞ

మైదుకూరు : ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా కళాశాలలో సోమవారం పరిశుభ్రంగా ఉంచుతామని, పర్యావరణం కోసం పాటుపడుతామని అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారానికి రెండు గంటలు వంతున ఏడాదికి వంద గంటలు పర్యావరణం కోసం, పరిసరాల పరిశుభ్రత కోసం పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి పీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు దూరం

ప్రొద్దుటూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులను అరికట్టవచ్చని పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మై భారత్ టోపీలు, పెన్నులు, బుక్కులు, గ్లవ్స్, శానిటైజర్లను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఇందిర, డాక్టర్ జ్యోతి, డాక్టర్ వాణి, డాక్టర్ పాండురంగారెడ్డి, గాయత్రి, రాజేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి షేక్ ఇమ్రాన్

దువ్వూరు : స్వర్ణాంధ్రప్రదేశ్ 2047లో భాగంగా మండల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని మండల ప్రత్యేక అధికారి షేక్ ఇమ్రాన్ పేర్కొన్నారు. సోమవారం దువ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో విజన్ 2047కు సంబంధించి మండల స్థాయి అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టిలో స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 తీసుకురావడం జరిగిందన్నారు. మండలంలోని కీలక రంగాలపై దృష్టి సారించి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రానున్న ఐదేళ్లలో మండలాన్ని అభివృద్ధి చేసేలా రూ.500 కోట్లకు ప్రణాకలు రూపొందించాలన్నారు. ఆయా శాఖల అధికారులు ఈనెల 30వ తేదీలోపు ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ 2025 మార్చి 31లోగా గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్లను పూర్తి చేసి, మన ఇల్లు – మన గౌరవం కార్యక్రమం నిర్వహించాలన్నారు. హౌసింగ్ శాఖ మండలంలో చాలా వెనుకబడి ఉందని, అధికారులు చిత్తశుద్ధితో పని చేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్, మండల ఇంజినీర్ సుబ్రహ్మణ్యం, ఏఓ అమరనాథ్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ అధికారులు, సిబ్బంది

చాపాడు : అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని వక్తలు తెలిపారు. మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో సోమవారం ఏపీఎస్ఏసీఎస్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, దాని నివారణ విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, గ్రామ సర్పంచ్ వెంకట శివప్రసాద్, సచివాలయ సిబ్బంది, సంస్థ సూపర్‌వైజర్ దర్బార్ వల్లి, ఏఎన్ఎం గ్రేసమ్మ, సీఎల్‌డబ్ల్యూ ఉపేంద్ర, ఆశా, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాయల్ కౌంటీలో సోమవారం రాణితిరుమలదేవి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలిపారు. విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తరుణేందు శేకర్, డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్ రైతులకు ప్రయోజనకరం



ఎరువులు దక్కించుకున్న వ్యక్తితో నగదు తీసుకుంటున్న వ్యవసాయాధికారులు

అట్లూరు : విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీశీలన కేంద్రం (అగ్రిల్యాబ్) రైతులకు ఎంతో ప్రయోజనకరమని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. సోమవారం ఆయన అగ్రిల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్రిల్యాబ్‌లో పరీక్షల నిమిత్తం నిల్వ చేసిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వేలం వేయడం జరిగిందని, ఈ వేలంపాటలో బద్వేలుకు చెందిన ఎరువుల దుకాణదారుడు హేమంత్‌కుమార్ దక్కించుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ మనకు అందుబాటులో ఉన్న అగ్రిల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకుని, తద్వారా కల్తీ లేని ఎరువులు, విత్తనాలను వినియోగించుకుని అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. అలాగే విత్తనాలు, ఎరువులను ల్యాబ్‌లో రైతులు ఉచితంగా పరీక్ష చేయించుకోవచ్చన్నారు. అనంతరం అగ్రిల్యాబ్ వ్యవసాయాధికారిణి మాధురి మాట్లాడుతూ పరీక్షల నిమిత్తం సేకరించిన ఎరువులను వేలం వేశామన్నారు. అనంతరం పుట్టాయపల్లెలోని రైతుసేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ రైతు సాగు చేసిన పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, అరుణ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఖాజీపేట : ధ్యానం ద్వారా మనిషిలోని చెడు ఆలోచనలు దూరం అవుతాయి.. తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పిరమిడ్స్ ధ్యాన ప్రచార నిర్వాహకులు గుండం శైలజ అన్నారు. ఖాజీపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ధ్యానం అనే అంశంపై స్థానిక ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానం వల్ల మనిషి మానసిక స్థితి మెరుగు పడుతుందని అన్నారు. నేటి నుంచి 41 రోజుల పాటు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల అనేక జబ్బులు దూరం అయ్యే అవకాశం ఉందని అన్నారు.

రేపు మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ ఈఓ శంకర్‌బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

పేదలకు పట్టాలు పంపిణీ చేయాలి

కాశినాయన : మండలంలోని అక్కెంగుండ్ల రెవెన్యూ పొలంలో బినామీ పట్టాలను రద్దు చేసి పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ పోలయ్య అన్నారు. 2017వ సంవత్సరంలో సీపీఎం పార్టీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాల వారి పట్టాలు రద్దు చేయాలని ఆందోళన చేశామని ఆయన పేర్కొన్నారు. అక్కెంగుండ్ల రెవెన్యూ పొలంలో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దారు బాలనరసింహులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కాశినాయన : మండలంలోని పిట్టిగుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాజనారాయణరెడ్డి చెన్నారెడ్డిపల్లె గ్రామానికి చెందిన జయరాజు కుమార్తె శ్రావ్య ఎమ్మెస్సీ చదుకునేందుకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కాశినాయన : మండలంలోని ఇటుగుల్లపాడు గ్రామానికి చెందిన మల్లెవేముల రమణయ్య వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉండటంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అతన్ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

చాపాడు : మండల వ్యాప్తంగా ఈ నెల 24 నుంచి డిసెంబర్ 24 వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఇ.మ్యాగి తెలిపారు. 24న ఉదయం 8.30 గంటలకు మడూరు అన్నవరం, మధ్యాహ్నం 2 గంటలకు అల్లాడుపల్లెలోని దేవాలయం, లక్ష్మీపేటలోని గంగమ్మ దేవాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమంపై గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. వివిధ రకాలైన పంటల సాగులో రైతులకు మెళకువలు, సూచనలు, సలహాలు ఇస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొనాలని ఏఓ కోరారు.

మైదుకూరులో..

మైదుకూరు : మండలంలో మంగళవారం నుంచి వ్యవసాయశాఖ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రతి మంగళ, బుధ వారాల్లో వ్యవసాయ, పశుసంవర్ధక, మార్కెటింగ్, మైక్రో ఇరిగేషన్, హార్టికల్చర్ యూనివర్సిటీ సైంటిస్టులు రైతుల వద్దకు నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని ఏఓ పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు పంటలకు సంబంధించి రైతులకు సలహాలు సూచనలు ఇస్తారని తెలిపారు. మంగళవారం శివపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో స్పెషలాఫీసర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు

అట్లూరు : అట్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల స్పెషలాఫీసర్ ఫణిశ్రీ, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల తెలిపారు. ఈ నెల 22న నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అండర్–19 టెన్నిస్ బాల్, క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరచారని వారు పేర్కొన్నారు. రిషిత, మస్తాన్‌బీ, శ్రీలక్ష్మీప్రసన్న, సుప్రియ, ఝాన్సీలక్ష్మి కడప జిల్లా జట్టు తరఫున జాతీయ స్థాయికి ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. అలాగే రిషిత అనే విద్యార్థిని బెస్ట్‌ప్లేయర్‌గా రాణించడంతో జిల్లా జట్టు తరపున సన్మానించినట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను సోమవారం వారు అభినందించారు.

26, 27న విభిన్న ప్రతిభావంతులకు శిబిరం



మాట్లాడుతున్న దివ్యాంగుల సొసైటీ కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఈ నెల 26, 27లలో ప్రభుత్వం విభిన్నప్రతిభావంతులకు ప్రత్యేక పరికరాల శిబిరం నిర్వహించనున్నట్లు ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలంలోని విభిన్న ప్రతిభావంతులు ఈ శిబిరంలో పాల్గొని పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

చాపాడులో..

చాపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26న పరికరాల కోసం దివ్యాంగులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక నమోదు శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. దివ్యాంగులైన పిల్లలు, పెద్దలకు బ్యాటరీ సైకిళ్లు, స్మార్ట్ ఫోన్లు, సీపీ చైర్స్, కలిపర్స్, ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, రొలేటర్లు వంటి వాటి కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. దివ్యాంగులు తమ ఆధార్, రేషన్ కార్డు, సదరం సర్టిఫికెట్, రెండు ఫొటోలతో రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

రోడ్డుపై శవపేటికతో బైఠాయింపు

- స్తంభించిన ట్రాఫిక్
- రెవెన్యూ, పోలీసు అధికారుల జోక్యంతో పరిష్కారం

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ నర్సింగుకొట్టాలకు చెందిన దళితులు శవపేటికతో ప్రధాన రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సోమవారం ఉదయం గంటల తరబడి శవం రోడ్డుపై ఉండటంతో వాహనాలు ఆగిపోయాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు వచ్చినా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

వివరాలిలా ఉన్నాయి. బాలదాసరి సుబ్బయ్య (80) ఆదివారం మరణించాడు. సోమవారం స్మశానంలో పూడ్చేందుకు బంధువులు ప్రయత్నించగా మరో వర్గం వారు (ఒక కుటుంబానికి చెందిన వారు) అడ్డుకున్నారు. ఆ స్థలం తమకు పట్టా అయిందని, అందులో శవాలు పూడ్చేందుకు అంగీకరించమని అడ్డు చెప్పడంతో సమస్య తలెత్తింది. ఈ సమస్య రెండు మూడేళ్లుగా ఉంది. శవాలు పూడ్చే భూమిని ఎలా పట్టా చేయించుకొంటారని ఆ గ్రామానికి చెందిన దళితులు ప్రశ్నిస్తున్నారు. వివాదం కొనసాగుతుండగానే అక్కడ 5 శవాలు పూడ్చారు. సోమవారం సమస్య మళ్లీ మొదటి కొచ్చింది. జక్కుల గురయ్య, రమణమ్మ కుటుంబీకులు శవం పూడ్చేందుకు అడ్డు చెప్పడంతో మృతుని బంధువులు శవంతో రోడ్డెక్కారు. సమాచారంతో సీఐ శ్రీనివాసులు సిబ్బందితో అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేసినా, శవాన్ని పూడ్చించే విషయంలో పరిష్కారం చూపలేకపోయారు. ఉదయం మీటింగులో ఉన్న తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి మధ్యాహ్నం తరువాత అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. పరిష్కారం కుదరక పోవడంతో బలవంతంగా శవాన్ని స్మశానంలోకి తీసుకెళ్లారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సహాయంతో అక్కడ గుంత తీసి శవాన్ని పూడ్చారు. సాయంత్రానికి సమస్య పరిష్కారం కావడంతో మృతుని బంధువులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా స్మశానంగా ఉన్న ఆ భూమిపై పట్టా పొందడం అన్యాయమన్నారు. రెవెన్యూ అధికారులు స్మశానానికి సర్వే నెంబరు 443లో కొంత భూమి కేటాయించి, హద్దులు ఏర్పరిచితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

సాంస్కృతిక యువజనోత్సవాలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

వేంపల్లి: రాష్ట్రస్థాయి సాంస్కృతిక యువజన ఉత్సవాలకు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్త పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన కడపలోని స్పిరిట్ కాలేజీలో స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాల పోటీలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వివిధ సాంస్కృతిక విభాగాలలో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జానపద బృంద నాట్యానికి మొదటి బహుమతి, జానపద సోలో విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు, జానపద బృంద గానంలో మొదటి బహుమతి, జానపద గీతం సోలో మొదటి బహుమతి, కవిత్వం విభాగంలో ద్వితీయ బహుమతులు కై వసం చేసుకున్నారని తెలిపారు. డైరెక్టర్‌తోపాటు పరిపాలనాధికారి విద్యార్థులను అభినందించారు.

కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి



సీతారాంఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కాశినాయన : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కమ్యూనిస్టు యోధుడు అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, మండల కన్వీనర్ పోలయ్య అన్నారు. సోమవారం మండలంలోని నరసాపురం గ్రామంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారని, విద్యార్థి స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు కలిగిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగారన్నారు. సీపీఎం, వామపక్ష పార్టీలకు, భారత రాజకీయాలకు సీతారాంఏచూరి మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆస్పత్రిలో సోమవారం మున్సిపల్, జిల్లా ఆస్పత్రి పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలను నిర్వహించారు. 90 మంది పారిశుధ్య కార్మికులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

కాశినాయన : మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల గ్రంథాలయానికి వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా పుస్తకాలు, సెల్ఫ్‌లు వితరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తలదించి నా వైపు చూడు నిన్ను తలెత్తుకునేలా చేస్తాను అంటుంది పుస్తకమేనని అన్నారు. కానీ సాంకేతిక రంగంలో వచ్చిన మార్పుల వల్ల మొబైల్, టెలివిజన్ వచ్చాక పాఠ్యపుస్తకాలు తప్ప ఇతర పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోయిందన్నారు. ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ మెర్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రొద్దుటూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని గోపవరం పంచాయతీలోని భగత్‌సింగ్ కాలనీ, ఆచార్లకాలనీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మేలు, రాబోవు రోజుల్లో అమలు చేసే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, సీఎం సురేష్ నాయుడు, వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధే ధ్యేయం

దువ్వూరు : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్ రూ.4 వేలకు పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించామన్నారు. ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే ప్రజలకు అధికారులు తిప్పుకోకుండా పనులు చేసి పంపాలన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర–2047 పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం గుడిపాడు నుంచి గొల్లపల్లె గ్రామానికి రూ.57లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి షేక్ ఇమ్రాన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్, మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి, టీడీపీ నాయకులు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పాపిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రొద్దుటూరు : స్థానిక గాంధీ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద డ్రైనేజీ కాలువలో పూడికతీత పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.నూర్ బాషా పాల్గొన్నారు.